## కపాలిని క్రమంలో భద్రకాళి

*రెండో రోజు వైభవంగా శాకంబరీ ఉత్సవాలు*



భద్రకాళీ శాకంబరీ నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు ఆదివారం ఉదయం అమ్మవారు కపాలిని, సాయంత్రం భగమాలినీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకుడు భద్రకాళీ శేషు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

*- వరంగల్, జూలై 7*

## ఇక రెండు చోట్ల గిరిజన దర్బార్

కొత్తగూడ, ఏటూరునాగారంలో ప్రతి సోమవారం నిర్వహణ




ఏటూరునాగారం, జూలై 7 : ఇక నుంచి ఐటీడీఏ ఆధ్వర్యంలో రెండు చోట్ల గిరిజన దర్బార్ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం కొత్తగూడ మండల కేంద్రంలోని రైతు వేదిక, ఏటూరునాగారంలోని ఐటీడీఏ కార్యాలయంలో దర్బార్లు ఉంటాయని పేర్కొన్నారు. ఇంజినీరింగ్, ఆరోగ్యం, గిరి వికాసం, పింఛన్, విద్యా విభాగం, ఐటీడీఏకు సంబంధించిన సమస్యల కోసం నోడల్ విభాగం ఉంటుందని తెలిపారు. ఈ రెండు కేంద్రాల్లో నిర్వహించే దర్బార్లను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని పీవో కోరారు.

ములుగు జిల్లా కేంద్రం వ్యూ



# మున్సిపాలిటీగా ములుగు

**బిల్లుకు గవర్నర్ ఆమోదం**

- **ములుగు, బండారుపల్లి, జీవంతరావుపల్లి జీపీలతో కలిపి ఏర్పాటు**
- **16,533 జనాభా.. 12,486 ఓటర్లు**
- **గత ప్రభుత్వ హయాంలోనే కార్యాచరణ**

ములుగు, జూలై 7 (నమస్తేతెలంగాణ): గ్రామపంచాయతీగా ఉన్న ములుగు జిల్లా కేంద్రం మున్సిపాలిటీగా మారనున్నది. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ బిల్లుకు ఆమోద ముద్ర వేశారు. ములుగు, బండారుపల్లి, జీవంతరావుపల్లి గ్రామపంచాయతీలతో కలిసి పురపాలికగా అవతరించనున్నది. 2019 ఫిబ్రవరి17న జిల్లా ఏర్పడిన నాటి నుంచి ములుగు పట్టణం పంచాయతీగానే కొనసాగింది. రాష్ట్రంలో గ్రామపంచాయతీ కేంద్రంగా ఉన్న ఏకైక ములుగు జిలా కేంద్రాన్ని ములుగు, బండారుపల్లి, జీవంతరావుపల్లి గ్రామపంచాయతీలను కలుపుకొని మున్సిపాలిటీగా మార్చేందుకు ఆయా పంచాయతీల పాలకవర్గాలు తీర్మానాలను చేయించి ప్రతిపాదనలు పంపించాయి. దీంతో అప్పటి ప్రభుత్వం శాసనసభలో పురపాలక చట్టం 2019కు సవరణ చేయడానికి ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేసింది. మూడు గ్రామ పంచాయతీలను కలుపుకొని 2011 జనాభా లెక్కల ప్రకారం మొత్తం 16,533 జనాభాతో 12,486 మంది ఓటర్లతో మున్సిపాలిటీగా ఏర్పాటవుతున్నది. తిరిగి జనాభా లెక్కలు పూర్తయినట్లయితే ప్రస్తుత జనాభాతో పాటు ఓటర్లు మరో 25 శాతం పెరిగే అవకాశం ఉంది.

**మూడు జీపీలతో మున్సిపాలిటీ ఏర్పాటు**

ములుగు మేజర్ గ్రామపంచాయతీలో జనాభా తక్కువగా ఉందనే కారణంగా ఇప్పటి వరకు మున్సిపాలిటీగా మారేందుకు ఆటంకాలు ఏర్పడ్డాయి. ములుగుకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బండారుపల్లి, జీవంతరావుపల్లి జీపీలను విలీనం చేసి మున్సిపాలిటీలో కలుపనున్నారు. ములుగు గ్రామపంచాయతీ పరిధిలో పాల్‌సాబ్‌పల్లి, రంగారావుపల్లి, ప్రేమ్‌నగర్, మాధవరావుపల్లి గ్రామాలున్నాయి. జీవంతరావుపల్లిలో గణేష్‌లాల్‌పల్లి శివారు గ్రామం ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ములుగులో 16 వార్డులు, 4 శివారు పల్లెలతో కలుపుకొని 12,135 జనాభా 9,422 ఓటర్లు ఉన్నారు.

అదేవిధంగా బండారుపల్లిలో 12 వార్డుల్లో 3,187 జనాభా 2,436 ఓటర్లు, జీవంతరావుపల్లి గ్రామంలో శివారు పల్లెతో కలుపుకొని 8 వార్డులు, 1,211 జనాభా, 628 ఓటర్లున్నారు. గత ప్రభుత్వ హయాంలో బిల్లును శాసనసభ, శాసనమండలిలో పాస్ చేసి గవర్నర్ ఆమోద ముద్ర కోసం పంపించగా గత గవర్నర్ పెండింగ్‌లో ఉంచారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ములుగు నుంచి మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న సీతక్క ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ములుగును మున్సిపాలిటీగా ఏర్పాటు చేసేందుకు కృషి చేయగా రాష్ట్ర ప్రభుత్వ సూచనలతో గవర్నర్ ఆమోద ముద్ర లభించింది.

# బంగారంతో పారిపోయిన వ్యక్తి అరెస్ట్

- **నిందితుడి నుంచి 7.3 తులాల బంగారం, స్కూటీ స్వాధీనం**
- **వివరాలు వెల్లడించిన సీఐ శివకుమార్**



స్వాధీనం చేసుకున్న బంగారం

గిర్మాజీపేట, జూలై 7: ఆర్డర్‌పై బంగారు ఆభరణాలు తయారుచేస్తానని వాటితో ఉడాయించిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ మచ్చ శివకుమార్ వివరాలు వెల్లడించారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని గాదిన్ గ్రామానికి చెందిన తారక్‌నాథ్‌బీర 2018లో వరంగల్‌కు వచ్చి గిర్మాజీ పేటలోని రాధిక టాకీస్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. అతడికి తెలిసిన బంగారు ఆభరణాలు తయారుచేసే అలోక్ వద్ద ఏడాదిపాటు పనిచేశాడు. తర్వాత సొంతంగా షాప్ పెట్టి ఆర్డర్లు తీసుకొనేవాడు. ఈ క్రమంలో తనకు తెలిసిన గోల్డ్‌స్మిత్ అబ్దుల్‌రహమాన్ వద్ద రూ. 10 లక్షల చీటీ వేయడంతోపాటు అతడికి 12 తులాల బంగారు ఆభరణాలను తయారు చేయించి ఇచ్చాడు. నగలు, చీటీ డబ్బులు ఇవ్వకుండా రహమాన్ పారిపోవడంతోపాటు తన దగ్గర పనిచేసే వర్కర్ సఫాన్ కూడా మూడున్నర తులాల బంగారంతో ఉడాయించాడు. అతడికి బంగారు ఆభరణాలు ఆర్డర్ ఇచ్చిన షాప్ యజమానుల నుంచి ఒత్తిడి పెరిగి ఆర్థిక సమస్యలు చుట్టుముట్టాయి. దీంతో తన దగ్గరకు ఆర్డర్‌పై ఆభరణాలు ఇచ్చే వారి బంగారాన్ని అమ్మి వర్కర్లకు జీతాలు ఇచ్చేవాడు. చాలా మందికి సరైన సమయానికి ఇవ్వకుండా వాయిదా వేస్తూ కొత్తగా వచ్చిన ఆర్డర్ బంగారం నుంచి పాత వాళ్లకు అడ్జెస్ట్ చేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో జ్యువెల్లరీ షాప్ యజమాని స్వపన్ 7.5 తులాలు, శ్రీనాథ్ 6.7 తులాలు, శ్రీనివాసులు 2 తులాలు మొత్తం ముగ్గురు కలిసి 16.2 తులాల బంగారు బిస్కెట్లు ఇచ్చి ఆభరణాలు తయారు చేయమని ఆర్డర్ ఇచ్చారు. దీంతో తారక్‌నాథ్ బీర హుజూరాబాద్‌కు చెందిన పాత కస్టమర్ రాజుకు 5 తులాలు, 3.9 తులాల బంగారాన్ని అమ్మి వచ్చిన డబ్బులను వర్కర్లకు జీతాలు ఇచ్చి ఇక్కడి నుంచి వెళ్లిపొమ్మని చెప్పాడు. మిగిలిన సుమారు 7.3 తులాల బంగారాన్ని దుకాణంలో పెట్టి దాన్ని వర్కర్‌తో తీసుకురమ్మని చెప్పి కుటుంబంతో సహా కలకత్తాకు ఫ్లైట్‌లో పారిపోయాడు. తర్వాత వర్కర్‌ను బంగారం విషయం అడిగితే భయపడి తాను తేలేదని చెప్పడంతో నిందితుడు శనివారం రాత్రి వరంగల్‌లోని తన షాపులో ఉంచిన 7.3 తులాల బంగారం, స్కూటీని తీసుకుపోవడానికి రావడంతో పోలీసులు పట్టుకొని అరెస్ట్ చేసినట్లు సీఐ శివకుమార్ వివరించారు.

*ఎస్సై శ్రీనివాస్ కుటుంబానికి న్యాయం జరగాలి*

- **మృతదేహంతో జాతీయ రహదారిపై బంధువుల బైఠాయింపు, రాస్తారోకో**
- **మూడు గంటల పాటు కొనసాగిన ఉద్రిక్తత**
- **మద్దతుగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే పెద్ది, బీఆర్ఎస్, దళిత సంఘాలు**
- **భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్ హామీతో ఆందోళన విరమణ.. అంత్యక్రియల నిర్వహణ**



జాతీయ రహదారిపై బైఠాయించిన పెద్ది దంపతులు, ఎస్సై కుటుంబసభ్యులు, దళిత సంఘాల నాయకులు

# బాధ్యులను అరెస్ట్ చేయాల్సిందే..



ఎస్సై శ్రీనివాస్(ఫైల్)



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్

నల్లబెల్లి, జూలై7: ఎస్సై శ్రీనివాస్ మృతికి బాధ్యులను అరెస్ట్ చేయాల్సిందేనని మండలంలోని నారక్కపేట జాతీయ రహదారిపై కుటుంబసభ్యులు, మాజీ ఎమ్మెల్యే పెద్ది, బీఆర్ఎస్, దళిత సంఘాల నాయకులు బైఠాయించారు. దీంతో మూడు గంటలపాటు ఉద్రిక్తత నెలకొనగా, భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ హామీతో ఆందోళన విరమించారు. వివరాలిలా ఉన్నాయి.. నారక్కపేట గ్రామానికి చెందిన శ్రీరాముల శ్రీనివాస్(38) 2014లో ఎస్సై ఉద్యోగం పొంది ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో పనిచేస్తున్నాడు. అయితే సీఐ జితేందర్‌రెడ్డి, సిబ్బంది వేధిస్తున్నారని మనస్తాపంతో జూన్ 30న పురుగుల మందు తాగగా, హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ క్రమంలో మృతదేహాన్ని నారక్కపేటకు తీసుకురాగా, జాతీయ రహదారిపై కుటుంబసభ్యులు బైఠాయించారు. ఉన్నతాధికారులు స్పందించి శ్రీనివాస్ మృతికి బాధ్యులైన పోలీస్ సిబ్బందితోపాటు సీఐని తక్షణమే అరెస్ట్ చేయాలని, తమకు న్యాయం చేయాలని మూడు గంటలపాటు రాస్తారోకో నిర్వహించారు. బాధితులకు అండగా మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితోపాటు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు, దళిత సంఘాల నాయకులు ఆందోళనలో పాల్గొన్నారు. డీసీపీ రవీందర్, నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ నచ్చజెప్పినా తమకు స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు కదిలేది లేదని బాధితులు భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్ నారక్కపేటకు చేరుకుని పెద్దితోపాటు మృతుడి భార్య, కుటుంబసభ్యులతో చర్చలు జరిపారు. ఎస్సై భార్యకు ప్రభుత్వ ఉద్యోగంతోపాటు ఎక్స్‌గ్రేషియా అందించేలా చర్యలు చేపడుతామని, శ్రీనివాస్ మృతికి కారకులైన వారిని తక్షణమే అరెస్ట్ చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో మృతుడి బంధువులు రాస్తారోకో విరమించి అంత్యక్రియలు నిర్వహించారు.

**రాష్ట్రంలో రాక్షస పాలన: మాజీ ఎమ్మెల్యే పెద్ది**

రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోంది. చట్టాన్ని సంరక్షించే పోలీసుకే రక్షణ లేకుంటే సామాన్యుడి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దళితుడై ఉండి దళిత పోలీస్ అధికారి గురించి పట్టించుకోలేదంటే ఆయనకు వారిపై ఉన్న చిత్తశుద్ధి తేటతెల్లమైంది. ఇకనైనా రేవంత్‌రెడ్డి సర్కారు స్పందించి ఎస్సై శ్రీనివాస్ మృతికి కారకులైన వారిని అరెస్ట్ చేసి ఉద్యోగం నుంచి రిమూవ్ చేయాలి. మృతుడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తూ రూ. కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి.



శ్రీనివాస్ అక్కను ఓదార్చుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

## ఆగిన మేనత్త గుండె



దార రాజమ్మ (ఫైల్)

నర్సంపేట రూరల్, జూలై 7: ఎస్సై శ్రీనివాస్ మరణ వార్త విన్న అతడి మేనత్త దార రాజమ్మ (65) గుండెపోటుతో ఆదివారం మృతి చెందింది. దుగ్గొండి మండలం నాచినపల్లి గ్రామానికి చెందిన రాజమ్మ తన మేనల్లుడు మృతి చెందాడని తెలియడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. వెంటనే కుటుంబసభ్యులు వరంగల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రాణాలు విడిచింది. ఆమెకు భర్త ఐలయ్య, ఇద్దరు కుమారులున్నారు. ఒకే రోజు ఇద్దరు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకున్నది. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆమె కుటుంబాన్ని పరామర్శించి, మృతదేహం వద్ద నివాళులర్పించారు.



బొగత జలపాతాన్ని వీక్షిస్తున్న పర్యాటకులు



మాసలొద్ది జలపాతంలో పర్యాటకులు

## బొగత, మాసలొద్దిలో పర్యాటకుల సందడి

వాజేడు, జూలై 7 : చీకుపల్లి అటవీప్రాంతంలోని తెలంగాణ నయాగర బొగతతో పాటు దూలపురం అటవీ ప్రాంతంలోని మాసలొద్ది జలపాతాల వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. సెలవు రోజు కావడంతో అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి జలపాతం వద్ద స్విమ్మింగ్‌పూల్‌లో స్నానాలు చేస్తూ ఎంజాయ్ చేశారు. చుట్టూ పచ్చని అడవిలో జాలువారుతున్న జలపాతాల అందాలను చూసి మంత్రముగ్ధులయ్యారు. జలపాతం వ్యూ పాయింట్ నుంచి బొగత అందాలను చూస్తూ సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.




# కేయూ ఈసీపై వివాదం!

**కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యుల నియామకం వివాదాస్పదమవుతున్నది. కార్యనిర్వాహక మండలిలో అర్హత లేని వారికి చోటు కల్పించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా తొలగించిన వారిని, కోర్టులో కేసు ఎదుర్కొంటున్న వారికి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ లో స్థానం కల్పించడంపై దుమారం లేపుతోంది. అదేవిధంగా తెలుగు విభాగంలో ఒప్పంద అధ్యాపకుడిగా పనిచేస్తున్న చిర్ర రాజు నియామకంపై ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ఉద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులు, మేధావులు మండిపడుతున్నారు. ప్రభుత్వ ఉన్నత విద్యా శాఖ కార్యదర్శిదీ, ఈయనది ఒకే సామాజికవర్గం కావడంతో పలు అనుమానాలకు తావిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.**

*- హనుమకొండ చౌరస్తా, జూలై 7*

*అర్హత లేని వారికి పాలక మండలిలో చోటు*

- **అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా తొలగించిన వారికి స్థానం**
- **ఒప్పంద అధ్యాపకుడినీ సభ్యుడిగా నియామకం**
- **ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి నిర్వాకం**
- **పలు అనుమానాలకు తావిస్తోందనే ఆరోపణలు**

హనుమకొండ చౌరస్తా, జూలై 7: ఈనెల 4న కేయూ పాలకమండలిని 9 మంది సభ్యులతో నియమిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశం జీవో జారీ చేశారు. ఇందులో ముగ్గురు సభ్యుల నియామకం వివాదాస్పదంగా మారింది. ప్రిన్సిపాల్ కోటాలో యూనివర్సిటీ లా కాలేజీకి చెందిన డాక్టర్ ఎన్ సుదర్శన్, యూనివర్సిటీ టీచర్ కోటాలో కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ బొద్దిరెడ్డి రమను సభ్యులుగా నియమించారు. 2019లో జరిగిన 130వ పాలకమండలి సమావేశంలో ఈ ఇద్దరితో పాటు మరో 28 మంది నియామకాలు అక్రమమని, వీరిని ఉద్యోగం నుంచి తొలగించాలని తీర్మానం చేశారు. 2010లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకమైన వీరిపై డాక్టర్ వినతారెడ్డి కేసు వేయడంతో 2015లో పూర్తి పాలకమండలి ద్వారా రెండు నెలల్లో ఆమోదించుకోవాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో 2019లో ఈసీ సబ్ కమిటీ సమావేశమై వీరి నియామకాలు అక్రమమని తేల్చింది. ఈ తీర్మానాలను అదే సంవత్సరం పాలక మండలి సభ్యులు ఆమోదించారు.

**ఈసీ తొలగించిన వారే ఈసీ సభ్యులా?**

పాలకమండలి వీరిని ఉద్యోగంలో నుంచి తొలగించాలని పేర్కొన్నా కేయూ అధికారులు తొలగించకపోవడంతో డాక్టర్ వినతారెడ్డి హైకోర్టును ఆశ్రయించగా అక్రమంగా నియామకమైన వీరిని ఎందుకు కొనసాగిస్తున్నారని కూడా ప్రశ్నించింది. అయినప్పటికీ కేయూ అధికారులు, ప్రభుత్వం వీరి తొలగింపుపై నిర్ణయం తీసుకోలేదు. హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరించారని మళ్లీ 2023లో కేసు వేయగా అప్పట్లో ఉన్నత విద్యా కార్యదర్శిగా ఉన్న వాకాటి కరుణ, ప్రస్తుత రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి కోర్టుకు హాజరుకాక తప్పలేదు. అనేకమంది ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, సీనియర్ ప్రొఫెసర్లు ఉండగా హైకోర్టులో కేసు ఎదుర్కొంటున్న, పాలకమండలితో అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకం రద్దు కాబడిన జూనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను పాలక మండలి సభ్యులుగా ప్రభుత్వం నియమించడంపై పలు అనుమానాలు లేవనెత్తుతున్నాయి. ఈ పాలక మండలిలో ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల నుంచి ప్రాతినిధ్యం లేదని, రద్దు చేయాలని కూడా పలువురు ఇప్పటికే ఫిర్యాదులు చేశారు.

**ఒప్పంద అధ్యాపకుడికీ స్థానం**

మరో సభ్యుడు చిర్ర రాజు కేయూలో తెలుగు విభాగంలో ఒప్పంద అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. ఇతడికి ఎమినెంట్ పర్సన్ కోటాలో సభ్యుడిగా నియమించడం కూడా వివాదాస్పదమైంది. చిర్ర రాజుకు కేయూ పాలకమండలిలో చోటు లభించడంపై ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్, ఉద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులు, మేధావులు మండిపడుతున్నారు.

**వీరి నియామకం చెల్లదు**

కాకతీయ యూనివర్సిటీలో 2010లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకమైన వారిపై హైకోర్టు, సుప్రీంకోర్టులో కేసు వేశా. 2019లో ఈసీ సబ్‌కమిటీ సమావేశమై వీరి నియామకాలు అక్రమమని తేల్చింది. వారి జీతాలు కూడా నిలిపివేయించాం. ఇప్పుడు వీరిని పాలకమండలి సభ్యులుగా కాంగ్రెస్ ప్రభుత్వం నియమించింది. పాలకమండలి వీళ్లను ఆమోదించలేదు. వీరి నియామకం చెల్లదు. మాకు జాబ్ రావాలని కోర్టుకు వెళ్లలేదు. అర్హులకు న్యాయం జరగాలి. అందుకోసమే మేం పోరాడుతున్నాం. అక్రమంగా నియామకమైన వారిని పాలకమండలిలో సభ్యులుగా తీసుకున్నారు. వెంటనే వారిని తొలగించాలి.

**– నాయిని వినతారెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్**

# వేలం ఎప్పుడో ?

- **ఎక్సైజ్ కార్యాలయంలో కుప్పలుగా వాహనాలు**
- **తుప్పు పడుతున్నా పట్టించుకోని అధికారులు**

ఏటూరునాగారం, జూలై 7 : ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం మండలాల్లో గుడుంబా, మద్యం రవాణాలో పట్టుబడిన వాహనాలతో ఎక్సైజ్ కార్యాలయం ఆవరణ నిండిపోయింది. కొన్ని నెలలుగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, టాటా మ్యాజిక్‌లను కార్యాలయానికి తరలించారు. అయితే ఈ వాహనాలపై కేసులు నమోదు చేసిన అధికారులు గడువు ముగిసిన తర్వాత వాటిని వేలం వేసి అమ్ముతుంటారు. వాటిని ఆర్టీఏ అధికారులు పరిశీలించి, ధర నిర్ణయించాల్సి ఉంటుంది. కొద్ది కాలంగా ఎక్సైజ్ అధికారులు వేలం పాటలు నిర్వహించకపోవడంతో సుమారు 50 వరకు ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు 20కి పైగా ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న కార్యాలయం ఆవరణ తక్కువగా ఉండడంతో ఇరుకుగా మారింది. వాహనాలు పట్టుబడితే వాటిని ఉంచేందుకు స్థలం కూడా లేకుండా ఉంది. ఆవరణలో ఉన్న వాహనాలను కాపాడేందుకు ఎక్సైజ్ సిబ్బంది తంటాలు పడాల్సి వస్తున్నట్లు సమాచారం.



కార్యాలయ ఆవరణలో ఉన్న ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు